ప్రజాశక్తి

శనివారం 24 మే 2025   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

మంత్రుల బృందం

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య



మాట్లాడుతున్న గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో నల్లబర్లీ రైతుల సమస్య పరిష్కారం, పొగాకు కొనుగోలు అంశాల పరిశీలన కోసం శనివారం జిల్లాకు వస్తున్న మంత్రివర్గ బృందం పర్చూరు, ఇంకొల్లు మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య విజ్ఞప్తి చేశారు. బాపట్లలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బర్లీ పొగాకు కొనుగోలు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో ఏర్పాటు చేసిన మంత్రివర్గ బందం జిల్లాకు వచ్చి ఇసుక దర్శి వద్ద ఉన్న పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలా కాకుండా మంత్రుల బృందం గుంటూరు నుంచి పెదనందిపాడు, పర్చూరు, ఇంకొల్లు మీదుగా మార్టూరు వరకు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే ప్రయత్నం చేయడం ద్వారా బర్లీ పొగాకు రైతుల సమస్య కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందన్నారు.

తక్షణమే కొనుగోలు చేయాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

బర్లీ పొగాకును తక్షణమే కొనుగోలు చేసి, పొగాకు రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య కోరారు. జిల్లాలో బర్లీ పొగాకు కొనుగోలు సమస్య తలెత్తిన ఫిబ్రవరి నెల నుండి ఇప్పటివరకు అనేక పర్యాయాలు రైతుసంఘం నేతలు రైతులతో మాట్లాడడం, గ్రామాలు పర్యటించడం జరిగింది. ఈ నెలలోనే రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉప్పుటూరు గ్రామంలో పర్యటించి కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరులో ▶ 2లో

ఆరుగురిని

బలిగొన్న అతివేగం

- రోడ్డుప్రమాదంలో స్టూవర్టుపురం వాసులు దుర్మరణం
- మృతిచెందిన వారిలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు..
- ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు



లారీని ఢీకొన్న ఇన్నోవా కారు



మృతిచెందిన వ్యక్తులు

ప్రజాశక్తి-కొమరోలు, గిద్దలూరు, బాపట్ల

డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యానికి ఆరుగురు బలయ్యారు. లారీని ఇన్నోవా కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఘటన ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, తాటిచెర్ల మోటు వద్ద అమరావతి-కడప జాతీయ రహదారిలో శుక్రవారం జరిగింది. బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందిన గజ్జల అంకాలు (50), మొగిలి భవాని (23), గజ్జల నరసింహ (25), గజ్జల జోసెఫ్(55), బొచ్చు సన్నీ (27), కర్రెద్దుల దివాకర్(27), సిద్దార్థ, గజ్జల సిరి అనే చిన్నారులతో కలిసి ఈ నెల 20న శ్రీశైలం, మహానంది ఇతర సందర్శన క్షేత్రాలను సందర్శించేందుకు ఇన్నోవా కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అతివేగంతో వెళ్తూ యూటర్న్ తీసుకునే క్రమంలో బేస్తవారిపేట నుండి వస్తున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని అంకాలు, భవాని, నరసింహ, జోసెఫ్, దివాకర్, సన్నీ అక్కడికక్కడే మృతిచెందారు. సిద్ధార్థ, గజ్జల సిరి అనే చిన్నారులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను బయటికి తీశారు. గాయాలపాలైన చిన్నారులను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జెసిబి సాయంతో ఇన్నోవా కారునును పక్కకు తీశారు. కారును నడిపే కర్రెద్దుల దివాకర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

స్టూవర్టుపురంలో తీవ్ర విషాదం

రోడ్డుప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంతో స్టూవర్టుపురంలో ▶ 2లో

టిడిపికి కార్యకర్తలే బలం..

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు సిద్ధం
- ఒంగోలు లో శాశ్వత జిల్లా పార్టీ కార్యాలయం
- ఉత్సాహంగా జిల్లా మహానాడు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారికి సముచిత పదవులు కేటాయించాలని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి, జిల్లా ఇన్‌చార్జి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పార్టీ పసుపు పండగ ఈనెల 27, 28 29 తేదీల్లో కడపలో జరిగే తెలుగుదేశం మహానాడును విజయవంతం చేయడానికి నియోజకవర్గ వర్గాల వారీగా భారీ ఎత్తున జన సమీకరణ చేయాలంటూ పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలోని బృందావనం ఫంక్షన్ హాల్లో శుక్రవారం ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మహానాడు కన్నుల పండుగగా జరిగింది. తోలుత ఎన్టీఆర్ విగ్రహానికి నేతలంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా పేద, బడుగు వర్గాల పక్షాన నిలబడి వారిని అభివృద్ధి బాటలో నడిపించేందుకు టిడిపి ఆవిర్భవించిందన్నారు. గత ఐదేళ్లలో ఒక దుష్టుడి పాలనతో రాష్ట్రం అన్ని రకాలుగాను చిన్నాభిన్నమైందన్నారు. అతనిని ఎదుర్కోవడానికి పార్టీలన్నీ ఏకమై కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చామని, సిఎం చంద్రబాబు నాయుడు, యువ మంత్రి లోకేష్ సమక్షంలో రాష్ట్రం గత వైభవాన్ని సాధిస్తుందన్నారు. గత రాక్షస పాలనలో వేధింపులకు, అక్రమ కేసులకు గురైన పార్టీ కార్యకర్తలకు పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ గత రాక్షస ప్రభుత్వంలో తెలుగుదేశం నాయకుల పై, కార్యకర్తలపై అక్రమ కేసులు వేధింపులు గురి చేశారని అలాంటి వారికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. చంద్రబాబు నాయుడిని 53 రోజుల పాటు అన్యాయంగా జైలులో ఉంచారని, అన్నింటినీ ఎదుర్కొని నిలదొక్కుకున్నామన్నారు. ఈ సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ధ్వంసమైన రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. జగన్ మూడు రాజధానుల విధానాన్ని ప్రజలు వ్యతిరేకించారని, అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అని, ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ▶ 2లో



సజ్జా కుటుంబాన్ని పరామర్శించిన ప్రజాసంఘాల నేతలు, అమరుల బంధుమిత్రుల సంఘ ప్రతినిధులు

నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌పై

సుమోటో కేసు నమోదు చేయాలి

8లో ▶



జిజిహెచ్‌లో రోగుల బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

5లో ▶

ఆరుగురిని బలిగొన్న అతివేగం

(మొదటిపేజీ తరువాయి)

విషాదఛాయలు అలుముకున్నాయి. వీరంతా ప్రతి ఏడాదీ దేవాలయాలను సందర్శించేందుకు వెళుతుంటారని, అలాగే ఈ సారీ వెళ్లారని గ్రామస్తులు తెలిపారు.

తీవ్రంగా కలిచివేసింది..

ప్రకాశం జిల్లా రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం మనసును తీవ్రంగా కలిచివేసింది. దైవ దర్శనానికి వెళ్లి వస్తూ ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటాం. ఈ సందర్భంగా మతుల కుటుంబాలకు మంత్రి స్వామి సానుభూతి తెలిపారు.

ప్రమాదంపై ముత్తుముల దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంపై గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లాకు చెందిన ఆరుగురు మృతి చెందడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులను ఎమ్మెల్యే ఆరా తీశారు. తర్వాత పరిస్థితి పరిశీలించాలని టిడిపి నాయకులు కష్ణ కిషోర్‌రెడ్డికి తెలపడంతో ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని టిడిపి నాయకులు కష్ణకిషోర్‌రెడ్డి వెళ్లి.. పరిశీలించారు. మృతదేహాలను గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు.

టిడిపికి కార్యకర్తలే బలం

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అమలు చేయబోతున్నామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవం, విశ్వాసానికి తెలుగుదేశం పార్టీ ప్రతీకని, తెలుగు వారి అభివృద్ధిలో విడదీయరానీ అనుబంధం ఉందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న సమయానికి చాలామంది కష్టపడిన నాయకులకు పదవులు లభించాయని, త్వరలో స్థానిక సంస్థల్లోనూ ఇతరత పదవులు వస్తాయని కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ తెలుగు వారికి అభివృద్ధికి పాటుపడిన స్వర్గీయ ఎన్టీఆర్ కు చెప్పిన భారతరత్న అవార్డు ఇవ్వాల్సిందిగా తీర్మానం చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గం నుంచి మహానాడుకు పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, యువ మంత్రి లోకే ష్ ల నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా పేద బడుగు వర్గాల పక్షాన నిలబడిందని దేశంలో ఏ పార్టీ లేదన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మంత్రి వర్గ సమావేశంలో చర్చించారని తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే ఎన్టీఆర్, నేడు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి మూల కారకులన్నారు. కడపలో జరిగే మహానాడుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. వై. పాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడుకు పార్లమెంట్ స్థాయిలో అన్ని నియోజకవర్గాల నుంచి వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ పథకాలు తో నియోజకవర్గంలో సాగుతున్నాయని అన్నారు. దీపం పథకం క్రింద గ్యాస్ అందిస్తున్నామని, అమరావతి రాజధానిగా పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా ఆమోదించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నారపుశెట్టి పాపారావు, కొఠారి నాగేశ్వరరావు, 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నా లేనట్లే..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అన్నదాతలకు యర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ సేవలు అందని ద్రాక్షగా మారాయి. దీంతో దాని పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డుకు ఆదాయం పుష్కలంగా ఉన్నా తమకు అండ లభించడం లేదని అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. యర్రగొండపాలెంలో 2012వ సంవత్సరం నవంబర్ 24వ తేదీన మార్కాపురం మార్కెట్ యార్డు నుంచి విడదీసి యర్రగొండపాలెంలో కొత్తగా మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. ఐతే అప్పటి నుంచి యర్రగొండపాలెంలోని మార్కెట్ యార్డు పేరుకే అన్న చందంగా మారింది. రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. యర్రగొండపాలెంలో గోడౌన్ కోసం స్థలం కేటాయించినా నిధులు మంజూరు కాకపోవడంతో తీవ్ర జాప్యం జరిగింది. మార్కెట్ యార్డు అందుబాటులోకి వచ్చి 13 ఏళ్లు గడిచినా గోదాములు నిర్మించకపోవడం పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

స్థలం కేటాయించినా..

యర్రగొండపాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డులో ప్రభుత్వం మార్కెట్ యార్డుకు 3.68 ఎకరాల స్థలం కేటాయించారు. ఆ స్థలంలో దాదాపు రూ. 10 లక్షలతో నిర్మాణం మొదలు పెట్టిన ప్రహరీ నిర్మాణం అప్పట్లోనే అర్థాంతరంగా నిలిచిపోయింది. ఎట్టకేలకు పూర్తి చేశారు. కార్యాలయ నిర్మాణం, గోడౌన్‌లు, ప్లాట్‌ఫారంల నిర్మాణానికి రూ.35 లక్షలతో పలు పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండాపోయింది. ఎట్టకేలకు కార్యాలయం నిర్మాణం పూర్తి చేసుకున్నారు. ప్లాట్ ఫాం పనులు జరుగుతున్నాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు..

యర్రగొండపాలెం మార్కెట్ యార్డుకు కూటమి ప్రభుత్వంలో అనిన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి మార్కెట్ యార్డు అభివృద్ధి చెందుతుందని రైతులు కూటమి ప్రభుత్వంపై ఆశ పెట్టుకున్నారు. ఇటీవలనే మార్కెట్ యార్డు చైర్మన్‌గా చేకూరి సుబ్బారావుకు అధిష్టానం ఎంపిక చేసింది. ఇంకా అధికారికంగా బాధ్యతలు తీసుకోలేదు. అన్ని సౌకర్యాలు సమకూరిస్తే మార్కెట్ యార్డు వల్ల ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగం కలగనుంది.

గోడౌన్‌లు లేకపోవడంతో ఇబ్బందులు

గంజి కోటిరెడ్డి, రైతు గంజివారిపల్లి

పంటలను నిల్వ ఉంచుకునేందుకు యర్రగొండపాలెం మార్కెట్ యార్డులో గోడౌన్‌లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతంలో ఉన్న ప్రైవేటు కోల్డ్ స్టోరేజీలను రైతులు ఆశ్రయించాల్సి వస్తోంది. ఉత్పత్తులు



యర్రగొండపాలెం మార్కెట్ యార్డు కార్యాలయం

నిల్వ ఉంచేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు తమ పంటలను తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు.అలాగే రైతు బంధు పథకాన్ని పొందలేకపోతున్నారు.

మార్కెట్ యార్డు ద్వారా రైతులను ఆదుకోవాలి

బొడ్డు ఆంజనేయరెడ్డి, రైతు, మురారిపల్లి



యర్రగొండపాలెం మార్కెట్ యార్డులో రైతులకు ఉపయోగపడే విధంగా సౌకర్యాలు కల్పించాలి. పూర్తి స్థాయిలో భవన సదుపాయం కల్పించాలి. గోడౌన్‌లను నిర్మించి రైతుల ఉత్పతుల నిల్వ ఉండేలా చూడాలి. ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

యార్డు లేక వినియోగించుకోలేక పోతున్నారు

షేక్ చిన్నఖాసిం, మార్కెట్ యార్డు కమిటీ కార్యదర్శి, యర్రగొండపాలెం



వ్యవసాయ మార్కెట్‌కు గోడౌన్‌లు లేకపోవడంతో రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. గోడౌన్‌లు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ప్లాట్ ఫాం నిర్మాణం జరుగుతుంది. నిధులు మంజూరు కాగానే గోదాముల నిర్మాణాలు ప్రారంభిస్తాం. తొందర్లోనే అన్ని సౌకర్యాలు సమకూరనున్నాయి.

మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

(మొదటిపేజీ తరువాయి)

పొగాకు కంపెనీల వాళ్ళతో దఫాల వారీగా చర్చలు జరిగాయి. కానీ ఇంతవరకు గ్రామాల్లో పొగాకు కొనుగోలు చేయలేదు. పొగాకు రైతులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు. అప్పుల వాళ్ళ ఒత్తిడి కూలీలకు సైతం డబ్బులు ఇవ్వలేని పరిస్థితుల్లో రైతులున్నారు. ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా టుబాకో బోర్డు ద్వారా లేక కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా కానీ పొగాకు కొనుగోలు చేయించాలని గంగయ్య డిమాండ్ చేశారు.

బంగారం రుణాలను రెన్యువల్ చేయాలి

కౌలురైతు సంఘం

పర్చూరు మండలంలో పెద్ద ఎత్తున పొగాకు సాగు చేసిన రైతులు కంపెనీలు చేసిన మోసం ఫలితంగా పొగాకు అమ్ముడు పోకతీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని, బంగారం మొత్తం అప్పు తీరిస్తేనే మరలా తిరిగి రుణం ఇస్తామని బంగారం రుణాలు చెల్లించాలని బ్యాంకుల వారు ఒత్తిడి చేస్తున్నారని, తమని ఆదుకోవాలని ఉప్పుటూరుకి చెందిన పొగాకు రైతులు, కౌలు రైతు సంఘం నాయకుల ద్వారా జిల్లా కలెక్టర్ వెంకటమురళికి శు క్రవారం వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వమే బాధ్యత తీసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా గాని పొగాకు బోర్డు ద్వారా గాని గిట్టుబాటు ధరకు పొగాకు కొనుగోలు చేయించాలని పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే గత సంవత్సరం బంగారు ఆభరణాలపై ఇచ్చిన పంట రుణాలను వడ్డీతో సహా వెంటనే కట్టాలని బ్యాంకుల వారు తమపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. పొగాకు అమ్ముడు పోక కూలీలకు సైతం డబ్బులు ఇవ్వలేని స్థితిలో రుణాలు చెల్లించలేమని అందువలన పొగాకు అమ్మేంతవరకు రుణాల వసూలు బ్యాంకులు వాయిదా వేయాలని లేదా రెన్యువల్ చేయాలని వినతి పత్రంలో కలెక్టర్ ని కోరారు. స్పందించిన కలెక్టర్ లీడ్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, పి కొండయ్య శ్రీనివాసరావు, డేవిడ్, రహీం, నీలకంఠం, రైతులు ఉన్నారు.

CHANGE OF NAME

I, KURAKULA SIDDAREDDY(Old Name) C/o.KURAKULA VENKAIAH Resident of 22, Indiramma Colony, 1st Line, Koppolu Road, Near Dreems School,Ongole, Prakasam District, Andhra Pradesh-523001. I have changed my name know as KURAKULA SRAVYA REDDY(New Name) C/o. KURAKULA VENKAIAH Hence after my name is know as KURAKULA SRAVYA REDDY(New Name)

ఒరిజినల్ సర్టిఫికేట్లు పోయినవి

ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, గ్రామ నివాసి **లేళ్లపల్లి మాధవరావు,** తండ్రి **చెన్నయ్య** కు చెందిన ఒరిజినల్ సర్టిఫికేట్లు పోయినవి. మాధవరావుకు చెందిన **10వ తరగతి, ఇంటర్మీడియట్,** డిగ్రీ మరియు **పోస్ట్ గ్రాడ్యుయేషన్** కు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికేట్లు పొన్నలూరు బస్టాండ్ సెంటర్ లో జెరాక్స్ కోసం వస్తుండగా పోయినవి. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
లేళ్ళపల్లి మాధవరావు, తండ్రి **చెన్నయ్య,**
పొన్నలూరు గ్రామం మరియు మండలం,
ప్రకాశం జిల్లా, సెల్: **99511 79165**

MISSING DOCUMENT

I, **POTELLA MANINDRA** W/o.**(Late) SUBBARAO,** aged about 70 years, resident of Karavadi Village, Ongole Mandal, Prakasam District, Andhra Pradesh, Pin-523182. Inform that, my original registered deed of sale document No.**3639/2005, 3640/2005,** Ongole survey No - **85/2** plot No.**17,20** which was in the name of my Husband by name **POTELLA SUBBARAO** while shifting the house we lost the Document in Karavadi Village If anyone find it, please inform at the following mobile numbe:**77308 91842**

నోటీసు

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.ఎ.నెం.229/2024 ఇన్ ఓ.యస్.నెం.695/2021

బిట్వీన్:
అంబటి శ్రీదేవి ....పిటీషనరు/వాది
మరియు
విష్ణుమొలకల వెంకటసుబ్బా రావు వగైరాలు
....రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To,
R-3: దండే బాల సుబ్రహ్మణ్యం,
తండ్రి. సాంబశివరావు, నివాసం. డోర్ నెం.7-24,
పెరవలి గ్రామం,వేమూరు మండలం,
గుంటూరు జిల్లా-522261. (ప్రస్తుతం బాపట్ల జిల్లా.)

పై నెంబరు దావాలో పార్టీలుగా చేర్చుట కొరకు దాఖలైన ఐ.ఎ.నెం. 229/2024 పిటీషనులో 3వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.30-06-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:30-06-2025

యస్.వంశీకృష్ణ,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్,
భారత్ పేట, గుంటూరు, సెల్:90595 84547

మహారాజశ్రీ ఏజెంట్ టూ గవర్నమెంట్ (జిల్లా కలెక్టర్ వారి కోర్టు నందు)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

O.S. No. 415/2024

బిట్వీన్ :
మాలోత్ సీతారాములు .... వాది
మరియు
ఇట్టి వెంకట బాబు .... ప్రతివాది

టు,
ఇట్టి వెంకట బాబు, తండ్రి సుబ్బారావు, వయస్సు : 28 సం॥లు, వృత్తి : తాపీమేస్త్రి, R/o రెడ్డిపాలెం (V), పైడిపల్లి (P), జరుగుమల్లి (M), ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్

వాది మీపై పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. దావాపై మీకు ఎటువంటి అభ్యంతరాలు వున్నచో మీరు ది. 07-06-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, లేదా మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు చెప్పుకోగలరు. లేనియెడల మీ పరోక్షములో తీర్మానం చేయబడుతుందని తెలియజేయడమైనది.

(కోర్టువారి అనుమతితో)

వాయిదా : 07-06-2025
కొత్తగూడెం
తేది : 21-5-2025

లిక్కినేని సత్యనారాయణ,
న్యాయవాది,
హౌస్ నెం.10-4-67, ఎల్ఐసి ఆఫీసు ప్రక్కన,
కొత్తగూడెం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
తెలంగాణ రాష్ట్రం.
సెల్ : 9440144989

జనరల్ నోటీసు

మా క్లయింట్ అనపర్తి జగజ్జీవన్‌రావు S/o రామస్వామి R/o బొబ్బేపల్లి మార్టూరు మండలం అను వారి సమాచారం ప్రకారం పబ్లిక్ నోటీసు జారీ చేయడమైనది.

నా క్లయింట్ ఈ క్రింది తెలుపబడిన స్థిరాస్థిని షేక్ కుందుర్తి మస్తాన్ గారి కుమారుడు షేక్ కుందుర్తి కరిముల్లా D.No:13-148/19 ముస్లిం బజారు, మార్టూరు గ్రామం అను వారి నుండి కొనుగోలు చేయుటకు మరియు విక్రయ ధఖలు వ్రాయించుకో బోతున్నారు. సదరు ఆస్తిని లోగడ శానం నాగలక్ష్మి D/o శానం నానయ్య C/o మార్టూరు అనువారు, శానం సాంబయ్య S/o పెరేటియ్య అనువారికి దఖలు దస్తావేజును వ్రాయించి ది.24/10/2016 గా మార్టూరు సబ్ రిజిస్టర్ ఆఫీసు నందు Doc. 3518/2016 రిజిస్టర్ కాబడి, తదుపరి సదరు శానం సాంబయ్య S/o పెరేటియ్య అనువారు ది.3/4/2025వ తేదిన షేక్ కుందుర్తి కరిముల్లా S/o షేక్ కుందుర్తి మస్తాన్ అను వారికి విక్రయపడి, విక్రయ దఖలు దస్తావేజు నెం: 1388/2025 గా రిజిస్టర్ చేసి ఉన్నారు. సదరు ఆస్తిని షేక్ కుందుర్తి కరిముల్లా విక్రయం చేయుటకు ఇష్టపడగా, నా క్లయింట్ సదరు డాక్యుమెంట్‌లో తెలియ చేయబడిన ఆస్తిని కొనుగోలు చేయుచున్నారు. కావున సదరు ఈ క్రింది షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనా, ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఈ నోటీసు జారీ చేసిన వారం రోజుల లోపు ఈ క్రింది అడ్రస్సుకు తెలియచేయగలరు. లేని పక్షంన సదరు స్థిరాస్తిపై ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి చట్టపరంగా కొనుగోలు చేసుకొని రిజిస్టర్ పొందగలడని యావన్మందికి తెలియచే యడమైనది.

షెడ్యూలు: బాపట్ల జిల్లా, రి.డి. మార్టురు సబ్.డి. మార్టురు మండల ఏరియాలోని మార్టురు గ్రామ D.No: 560/1A, LPM No: 255 AC.1.932 సెంట్లలో పాత డోరు నెంబర్ 2-120 గా ఉండి ప్రస్తుత కొత్త డోరు నెం: 3-8 అసెస్మెంట్ నెం: 743లో ఉన్న డాబా ఇంటికి హద్దులు.

తూర్పు: జోసఫ్ గారి ఇల్లు హద్దు – 66 అడుగులు
దక్షిణం: ఇతరుల ఖాళీ స్థలం హద్దు – 35 అడుగులు
పడమర: పల్లెపోగు ఆనందరావు గారి డాబా ఇల్లు హద్దు – 66 అడుగులు
ఉత్తరం: పంచాయితీ బజారు హద్దు – 35 అడుగులు

ఈ అడుగుల మధ్య 256 చ.గ. (214.00 చ.మీ) స్థలం అందులో నిర్మితమైన 750 చ.అడుగుల S/o స్లాబు గ్రౌండ్ ఫ్లోర్ నున్న ఈ ఇంటిపైన మొదటి అంతస్తుగా నిర్మాణం చేయబడిన 750 చ.అ. ఫస్ట్‌ఫ్లోర్‌లో ఈ ఇంటికి తూర్పు వైపున అంటించి నిర్మాణం చేసిన 300 అడుగుల కొలతల RCC స్లాబు గల ఇల్లు దానిలో పొందు పరిచిన యావత్ విషిష్ట కలపతో సహా కలిగిన ఆస్తి.

పోతుల వెంకటేశ్వరరావు, పోతుల దృశ్య
అడ్వకేట్స్, MRO ఆఫీసు ఎదురు, చిలకలూరిపేట.
సెల్: 9440207917, 08639386249

ప్రజాశక్తి 3
శనివారం 24 మే 2025

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు..

- ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ మృతి
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు ఇదే



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఇంటెలిజెన్స్ ఐజి

ప్రజాశక్తి - చీరాల

ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెదనందిపాడు- పర్చూరు రహదారిలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన కీర్తి వెంకటరాజు (45) బాపట్ల జిల్లా ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు గుప్తాతో కలిసి కారులో చీరాల వస్తున్నాడు. కారు ఘటనా స్థలం వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో వెంకటరాజు మృతిచెందాడు. గుప్తకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటరాజు మృతదేహాన్ని ఇంటెలిజెన్స్ ఐజి పిహెచ్‌డి. రామకష్ణ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టిఖర్చుల నిమిత్తం పోలీస్ శాఖ తరపున రూ. లక్ష నగదు వెంకటరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకటరాజు మృతి పట్ల ఎస్‌పి తూషార్ దూడి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతరం పోలీసు లాంఛనాలతో వెంకటరాజు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్‌పి మోయిన్, రీజినల్ ఇంటిలిజెన్స్ ఆఫీసర్ వి.శ్రీరామ్, బాపట్ల ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ జివి. నారాయణ, చీరాల టూటౌన్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు వెంకటరాజు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



వెంకటరాజు (ఫైల్)

తండ్రి చేతిలో తనయుడు హతం



కాశీ విశ్వనాథరావు(ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బొలెరో వాహనం విషయంలో చోటు చేసుకున్న ఘర్షణలో తండ్రి చేతిలో కుమారుడు హతమయ్యాడు. ఈ ఘటన యర్రగొండ పాలెం పట్టణంలోత పాలకేంద్రం ఎదురుగా శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్రగొండపాలెం పట్టణంలో మార్కాపురం రోడ్డులోని పాత పాలకేంద్రం ఎదురుగా నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ దంపతులకు ఇద్దరు మగ సంతానం. రెండో కుమారుడు కాశీ విశ్వనాథరావు(25)కు బొలెరో వాహనం ఉంది. ఆయన డ్రైవర్‌గా వెళుతుంటాడు. వై కొత్తపల్లిలో నివాసం ఉంటున్నాడు. కాశీ విశ్వనాధరావుకు తెలియకుండా ఆయన తండ్రి బొలెరో వాహనాన్ని తీసుకువెళ్లాడు. తనకు తెలియకుండా తన వాహనాన్ని ఎందుకు తీసుకెళ్లావని కాశీవిశ్వనాధరావు తన తండ్రిని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న లక్ష్మీనారాయణ కత్తి తీసుకొని వీరంగం సృష్టించాడు. దీంతో ఆయన భార్య కలుగజేసుకొని వారించేందుకు ప్రయత్నం చేసింది. ఆమె మీదకు కూడా దాడి చేసేందుకు ప్రయత్నం చేశాడు. అదే సమయంలో కాశీ విశ్వనాధరావు తన తండ్రి చేతిలోని కత్తిని తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కత్తి కాశీ విశ్వనాధరావుకు తగిలింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న ఎపిఒ

పండ్ల తోటలతో ప్రయోజనం

ప్రజాశక్తి-సిఎస్.పురం

పండ్ల తోటల సాగు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, అధిక లాభాలు కూడా పొందవచ్చునని ఉపాధి హామీ ఎపిఒ శ్రీనివాసనాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెదగోగులపల్లి గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద సాగుచేసిన మామిడి తోటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా పండ్లతోటల సాగుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పండ్ల తోటల సాగుకు ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి కార్యాలయంలో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి



ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకు రైతులకు ఎప్పుడూ అండగా నిలిచేది టిడిపి ప్రభుత్వ మేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. పొగాకుకు మద్దతు ధరల కల్పనకు సిఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఓ కమిటీ వేసినట్లు తెలిపారు. వైసిపి ఇంకా శవ రాజకీయాలు చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2016లో పొగాకు ధరలు పడిపోయిన సమయంలో అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడి మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. రైతులకు నష్టపరిహారం కేంద్రం క్వింటాకు రూ.1500 ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.500 కలిపి రూ.2000 వంతున ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి

పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్

ప్రజాశక్తి-కొండపి

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లను అమ్మకానికి తీసురావాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు మండెల్లో మగ్గిన పొగాకును బేళ్ల కట్టుకొని అమ్మకానికి తీసుకొని రావాలన్నారు. బేళ్లు అమ్మకానికి తీసుకుని వచ్చేటప్పుడు తేమ,వేడి లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు వేలానికి తీసుకొని వచ్చిన బేళ్లలో నోబిడ్స్ లేకుండా మంచి సరాసరి ధరతో కొనుగోలు చేసేలా బయ్యర్లతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో లోగ్రేడ్ పొగాకునుకొనుగోలు చేయడం ఎంతో అవసరమని తెలిపారు. ఇది రైతుల్లో నెలకొన్న అసంతప్తిని తగ్గించడంలో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్,రైతులు తదితరులు పాల్గొన్నారు.



పొగాకు.వేలాన్ని పరిశీలిస్తున్న యశ్వంత్ కుమార్

మద్యానికి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్ద మంతనాల, పనుకుమడుగు, నల్లగుంట్ల గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మద్యం వల్ల కలిగే కష్ట నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మద్యానికి దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి జీవితాలను నాశం చేసుకోవద్దని తెలిపారు. అనంతరం దోర్నాలలో మద్యం విక్రయిస్తున్న ఐనేని వెంకట నారాయణ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, మార్కాపురం ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాల పుట్ట గొడుగులు అందజేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలలో ఇఎల్‌పి నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఉద్యాన కళాశాల మొదటి సంవత్సరం విద్యారులు తమ విద్యాభ్యాసంలో భాగంగా పాల పుట్టగొడుగులను ఉత్పత్తి చేశారు. ఉత్పత్తి చేసిన పాల పుట్టగొడుగులను కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కదిరి పార్థసారథికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కదిరి పార్థసారథి విద్యారులను, అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శంకర్‌రెడ్డి, రామాంజనేయులు, భరత్‌కుమార్, మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-తాళ్లూరు

మండల పరిధిలోని లక్కవరం, దోసకాయలపాడు గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అవసారానికి మించి పురుగు మందులు వినియోగించవద్దని తెలిపారు. అధికారుల సూచనలు, సలహాల మేరకు పురుగు మందులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ శాఖ అధికారులు, విఎఎ ఎ.భార్గవి, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించిన వారిపై కేసు నమోదు చేశారు. మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం నిందితులను హాజరుపరచగా న్యాయమూర్తి ఎం. బాలాజీ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.40 వేల జరిమానా విధించినట్లు మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎం. సైదుబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం. సైదులు బాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు. వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడరాదని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఏదైనా ప్రమాదం సంభవిస్తే వారి కుటుంబం వీధిన పడుతుందన్నారు.



ప్రజాదర్బార్లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - చీరాల

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చిన 165 అర్జీల్లో పెన్షన్ కోసం 30, ఇళ్ల స్థలాల కోసం 130, ఇతర సమస్యలపై 5 అర్జీలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



జాబ్ మేళా నిర్వహిస్తున్న అధికారులు

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్తంగా పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో 11 కంపెనీలతో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు కళాశాల ప్రిన్సిపల్ లాజారేష్ బాబు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాలు, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ విస్తృతంగా నిర్వహిస్తుందని అన్నారు. వాటిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 347 మంది నిరుద్యోగ యువత హాజరవగా 191 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ బీగాల, హారిక, యంగ్ ప్రొఫెషనల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, ఎపి ఎస్ఎస్‌డిసి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




చిరంజీవి అభిమానులను సన్మానిస్తున్న డాక్టర్ హరీష్

చిరు అభిమానులకు సత్కారం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా బ్రోచర్‌ను శుక్రవావరం ఆవిష్కరించారు. రావణం స్వామి నాయుడు, చిరంజీవి యువత, కొర్రు నాంచారయ్య ఆధ్వర్యంలో స్థానిక గుళ్లపల్లిలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ హరీష్ చే బ్రౌచర్ ఆవిష్కరించారు. చిరంజీవి స్ఫూర్తితో వారోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజాసేవలో చిరంజీవి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. చందు వెంకటేశ్వర మాస్టర్, డాక్టర్ సైలేంద్ర చేతుల మీదుగా చిరంజీవి సీనియర్ అభిమానులకు సన్మానం చేశారు. అభిమానులు కొర్రా నాంచారయ్య, విష్ణువర్ధన్, చంద్రమోహన్, మాదాసు అప్పారావు, కూచిపూడి రామారావు, పోలేరయ్య, కృష్ణ ప్రసాద్ తదితరులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎల్లెల రవి కిరణ్, మొగలిపువ్వు సుబ్రహ్మణ్యం, శివరామయ్య, సుధాకర్, శ్రీకాంత్, రజిని పాల్గొన్నారు.

ఘనంగా నరేంద్రవర్మ పుట్టినరోజు వేడుకలు



నరేంద్రవర్మ జన్మదిన వేడుకల్లో సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో పాల్గొని నరేంద్ర వర్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి సౌజన్యంతో రక్త దాన శిభిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో రికార్డు స్థాయిలో 156 మంది కార్యకర్తలు రక్త దానం చేశారు. వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25మంది దివ్యంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణి చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 70 మందికి రూ.45లక్షల విలువైన చెక్కులు లబ్దిదారులకు అందచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం నాయకులు నరేంద్ర వర్మ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - రేపల్లె

వేస్ట్ పిక్కర్స్ (ప్లాస్టిక్ వ్యర్థాలు) సేకరించేవారిని ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేసి సాధికారత కల్పించేందుకు సమగ్ర నమోదు ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) పథకంలో భాగంగా వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రక్రియ శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపారు. నమస్తే అనే పథకం ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునేవారు, జుట్టు సేకరించేవారికి అనధికార పారిశుధ్య కార్మికులకు, వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు కల్పించుటకు తోడ్పడుతుందని తెలిపారు. వృత్తికి ఉపయోగపడే పిపిఈ కిట్‌లు ఈ పథకం ద్వారా నమోదు చేసుకున్న వారికి అందజేయ నున్నట్లు తెలిపారు. ఆధార్ లేని వేస్ట్ పిక్కర్లను గుర్తించి ఆధార్ కార్డులు తీయిస్తామని తెలిపారు. జీరో బ్యాంక్ అకౌంట్, ఈ శ్రమ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడడం పథకం లక్ష్యమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే వేస్ట్ పిక్కర్‌ల పిల్లలకు ఈ పథకం ద్వారా ఆ పాఠశాలలో ఫీజు చెల్లించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కమిషనర్ కె సాంబశివరావు

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ మాట్లాడుతూ పట్టణంలో వందలాదిగా మంది చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జుట్టు సేకరించే వారు ఉన్నట్లుగా గుర్తించామని అన్నారు. వివరాలు నమోదు చేసి వారిని సామాజిక భద్రత పథకాల్లో భాగస్వామ్యం చేయడం కోసం డిబిఆర్సీ రిసోర్స్ ఆర్గనైజేషన్ ఆరు జిల్లాల్లో ఈ కృషిలో నిమగ్నమైందని తెలిపారు. 40మందికి పైగా వేస్ట్ పిక్కర్లు, హెయిర్ పిక్కర్లు హాజరయ్యారని తెలిపారు. వారిలో అన్ని ఆధారాలు ఉన్న వారిని నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది సురేంద్ర, సానిటరీ కార్యదర్శిలు, డిబిఆర్‌సి వాలంటీర్లు ఆనంద్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్దే నిత్యావసరాలు పంపిణీ



మాట్లాడుతున్న తహాశీల్దారు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బట్టిప్రోలు

జూన్ 1 నుండి రైస్ కార్డు లబ్ధిదారులు రేషన్ సరుకులను డీలర్ల వద్దకు వెళ్లి తీసుకోవాలని తహశీల్దారు మేక శ్రీనివాసరావు సూచించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఆయా షాపుల పరిధిలో గ్రామాల్లో 1 నుండి షాపుల వద్ద సరుకు తీసుకునే విధంగా టాం టాం వేసి ప్రచారం చేయాల్సి ఉంద న్నారు. 1నుండి 15వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పంపిణీ నిర్వహించాల్సి ఉంటుంద న్నారు. 65ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు రేషన్ ఇంటి వద్దకే చేరే విధంగా డీలర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏమైనా అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తే అలాంటి డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు హెచ్చరించారు.

చెరుకుపల్లి : జూన్ నుండి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతుందని తహశీల్దారు సిహెచ్ పద్మావతి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే నిత్యవస రాలు తీసుకు వెళ్లి ప్రతినెల 5వ తేదీలో సరుకులు అందజేయాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12వరకు, సాయంత్రం 4నుండి 8 గంటల వరకు బియ్యం, పంచదార తదితర వస్తువులను పంపిణీ చేయాలని ఆదేశించారు. స్టాక్ బోర్డును సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. నూతనంగా రేషన్ డీలర్ల వద్ద పంపిణీ చేస్తున్న సందర్భంగా గ్రామ కూడళ్ళలో బ్యానర్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. 1న పండుగ వాతావరణంలో రేషన్ షాపును ప్రారంభించాలని కోరారు. సమావేశంలో సివిల్ సప్లై డిటి ఓం కార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకుపల్లి తహశీల్దారు పద్మావతి



సబ్ జైలు సందర్శించిన గుంటూరు జడ్జి సయ్యద్ జియావుద్దీన్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, గుంటూరు జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ శుక్రవారం సందర్శించారు. జైలు గదులను ఆయన పరిశీలించారు. సబ్ జైల్లో ఖైదీల సౌకర్యాలు, భోజన వసతులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ఆయన మాట్లాడారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఖైదీలకు తెలిపారు. 70ఏళ్ల వయసు పైబడిన ఖైదీల వివరాలు సబ్ జైలు అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని, క్షణికావేశంలో చేసిన తప్పులను తిరిగి చేయకుండా నేర ప్రవృత్తిలో మార్పు రావాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు అధికారి ఆచారి, సబ్ జైల్ అధికారి వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కొత్తపల్లి శ్రీవాణి, జి కుమార్ బాబు, పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, ఆలా మోషే పాల్గొన్నారు.



పూర్ణచంద్రరావును సత్కరిస్తున్న కార్యకర్తలు

టిడిపి చల్లారెడ్డిపాలెం అధ్యక్షునిగా 'కీర్తి'

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చల్లారెడ్డిపాలెం టిడిపి అధ్యక్షునిగా కీర్తి పూర్ణచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో శుక్రవారం నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తెలుగుదేశంను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, టిడిపి అధికార ప్రతినిధి మహేంద్ర నాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కీర్తి వెంకటేశ్వర్లు, కటారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తడిసిన పొగాకు పరిశీలిస్తున్న అధికారులు

తడిసిన పొగాకు పరిశీలన

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని ఆదిపూడి ఎస్సీ కాలనీలో రైతులు సాగుచేసిన నల్లభర్లీ పొగాకు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిచిపోయింది. ఈ నేపథ్యంలో హార్టికల్చర్ అసిస్టెంట్ శాంతి శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతుల వివరాలను ఆన్లైన్‌లో నమోదుచేశారు. కార్యక్రమంలో ఆమెతోపాటు నాయకులు కొమ్మినేని చంద్రశేఖర్, దాసరి మల్లేశ్వరరావు, పారి వీరయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేంద్రవర్మ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రకాశం జిల్లా కొమరోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని స్టువర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు మరణించడం, మరో ఇద్దరు గాయపడటం బాధాకరం అన్నారు. చనిపోయిన వారి మృతికి శాసన సభ్యులు నరేంధ్రవర్మ నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శివారు కాలనీల

తాగునీటి సమస్య పరిష్కరించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నగరంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ప్రక్రియ లోపాలు సరిచేసి మూడు రోజులకోసారి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు శుక్రవారం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో సుమారు 50 కాలనీలలో తాగునీటి సరఫరా లేనందున ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మార్చిలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య ప్రచార యాత్రలో శివారు కాలనీలలో ప్రజలు వారానికి ఒక్కరోజు ట్యాంకర్ ద్వారా నీరు ఇస్తున్నారని, వారం రోజుల పాటు నీరు నిల్వ ఉండటం వల్ల నీటిలో పురుగులు చేరుతున్నట్లు ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. కనీసం మూడు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా అందించాలని తాము ఆందోళన చేపట్టమని గుర్తు చేసారు. తాగడానికి గుక్కెడు మంచినీళ్ల సరఫరా చేయలేని దుస్థితిలో నగరపాలక సంస్థ ఉండడం సిగ్గుచేటన్నారు. మరికొందరు అక్రమార్కులు ఇదే అదనుగా భావించి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అక్రమంగా తరలిస్తూ అక్రమ వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. నీటి సరఫరాపై నిఘా లేకపోవడంవల్ల అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నీటి సరఫరా అంశంపై, పాలక వర్గం, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు దష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ నీటి సరఫరాను అరికట్టి.. శివారు కాలనీల్లో మూడు రోజులకు ఒకసారి రక్షిత మంచినీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీ అప్లికేషన్‌లో

మార్పులకు వెసులుబాటు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉపాధ్యాయులు బదిలీలల దరఖాస్తులలో దొర్లిన పొరపాట్లు సరిచేసుకోవడానికి విద్యాశాఖ వెసులుబాటు కల్పించింది. మండల విద్యాశాఖాధికారులకు ఎడిట్ ఆప్షన్ ఇస్తూ శుక్రవారం నాడు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు జిల్లా విద్యా శాఖాధికారి పేర్కొన్నారు. టీచర్ ట్రాన్సర్ అప్లికేషన్‌ను సబ్మిట్ చేసిన తర్వాత, ఏవైనా వివరాలలో మార్పులు చేయాల్సిన అవసరం ఎదురైతే, మండల విద్యాధికారులను సంప్రదించాలని సూచించారు.అప్లికేషన్ ఫైనల్ సబ్మిట్ చేసిన తర్వాత టీచర్లకు స్వయంగా ఎడిట్ చేసుకునే అవకాశం ఉండదన్నారు.అయితే, ఎంఇఓలకు ప్రభుత్వము ప్రత్యేకంగా ఎడిట్ ఆప్షన్ ను అందుబాటులోకి తీసుకువచ్చినందున, వారి సహకారంతో అవసరమైన సవరణలు చేయించుకోవచ్చని తెలిపారు.మార్పులు కావాల్సిన అంశాలు స్పష్టంగా రాసి, అవసరమైన ఆధారాలను జతచేసి, ఎంఈఓ ల ద్వారా అప్లికేషన్‌ను సరిదిద్దించవచ్చు.

ఎంటిఎస్ వారికి స్పాజ్ వర్తించదు....

ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తలెత్తిన సందేహాలపై విద్యాశాఖ వివరణ ఇచ్చింది. ముఖ్యంగా ఎంటిఎస్ (మినిమమ్ టైమ్ స్కేల్) లో పని చేస్తున్న వారికి స్పౌజ్ వర్తించదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా 2023 లో ప్రమోషన్ పొంది, సర్ ప్లస్ అయిన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్లు ఇవ్వరు, రేషనలైజేషనల్ పాయింట్స్ 5 మాత్రమే వస్తాయి.ఎనిమిది సంవత్సరాల సీలింగ్ అందరికీ వర్తిస్తుంది.రెండు సంవత్సరాలలో రిటైర్డ్ అయ్యే వారికి మినహాయింపు ఉంది, కానీ వారు జనరల్ గా అప్లై చేస్తే వారి పోస్ట్ ఆటోమేటిక్ గా ఖాళీగా పరిగణించబడుతుంది. ఇతర జిల్లాలో పనిచేసినప్పటికీ స్పౌజ్ పాయింట్లు వర్తిస్తాయి.

హెడ్‌మాస్టర్ల బదిలీలకు 141 దరఖాస్తులు

సాధారణ బదిలీలకు సంబంధించి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో హెడ్ మాస్టర్ల బదిలీ దరఖాస్తు ప్రక్రియ ముగియగా 141 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. 128 మంది సాధారణ బదిలీ కోసం దరఖాస్తు చేయగా 13 మంది కంపల్సరీ బదిలీకి దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటికి సంబంధించి 114 దరఖాస్తులు ఎల్-1 స్టేజ్‌లో రెండు దరఖాస్తులు ఎల్-2 స్టేజ్ లో వెరిఫికేషన్ పూర్తయినట్లు వెల్లడించారు.

యుటిఎఫ్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలు, సాంకేతిక లోపాలకు సంబంధించిన సందేహాలు నివత్తి చేయడానికి హెల్ప్ డెస్క్ (సహకార కేంద్రం)ఉపయోగపడుతుందని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని యుటిఎఫ్ భవన్ నందు హెల్ప్ డెస్క్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్ననూ ఆన్లైన్ దరఖాస్తు సబ్మిషన్ చేయడానికి, వెబ్ ఆప్షన్ కొరకు అవసరమయిన సహాయం అందజేస్తారని పేర్కొన్నారు. యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన హెల్ప్ డెస్క్ బదిలీల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు కొనసాగుతుందని తెలిపారు. యుటిఎఫ్ పది మంది సభ్యులు టీంగా ఐటీ సెల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు వీరు ఉపాధ్యాయుల ఆన్లైన్ అప్లికేషన్ సబ్మిషన్



హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

మరియు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పై నిరంతరం పనిచేస్తారని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు సూచించారు. కాగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ సంబంధించిన సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడటానికి మరియు పరిష్కరించడానికి జిల్లా నాయకత్వం ఒక ప్రత్యేకమైన టీం ని ఏర్పాటు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి జిల్లా కార్యదర్శులు ఎం బాలరాజు, ఎం సంధ్యారాణి, శుద్ధపల్లి ప్రసాద్, డివి జనార్ధన్,వై వెంకట్రావు, కె.వి నరసింహారావు, బి.సోమసుందర్రావు, పి శ్రీనివాసులు రెడ్డి, ఆర్ నారాయణ పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం



మాతాశిశు వైద్యశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలను, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్)ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. తొలుత కలెక్టర్ మాతా శిశు వైద్యశాలను సందర్శించి, ఆసుపత్రిలోని ఓపి రిజిస్ట్రేషన్ విధానంపై సంబంధిత రిజిస్టర్స్ ను పరిశీలించారు. జనరల్ ఓపి వార్డును, ఎన్టీఆర్ వైద్య సేవల కౌంటర్ ను, ఆపరేషన్ థియేటర్, పోస్ట్ నేటల్ వార్డు, కాన్పుల వార్డు, స్టెరిలైజేషన్ రూమ్ ను, యాంటినెటల్ వార్డు వంటి విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించి తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలతోపాటు నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు పై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వైద్యులను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్) సందర్శించి ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వివిధ వార్డులను, చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న భోజనం కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల్లో అలసత్వాన్ని ప్రదర్శించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు సత్వరం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, వైద్యులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలను, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్)ను పరిశీలన చేసి మరమ్మతు పనులను పరిశీలించామన్నారు. మాతా శిశు వైద్యశాలలో ఎంఎన్‌బియు యూనిట్ పనులు జరుగుతున్నాయని, 10 రోజుల్లో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. జిజిహెచ్ లో సదరం సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కోసం వచ్చిన వారితో మాట్లాడానని, వారు కూడా కొన్ని విషయాలను తన దష్టికి తీసుకొచ్చారన్నారు. వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మెరుగైన వైద్య సేవలు అందిచేలా వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. జిజిహెచ్ లో ఎంఎన్ బియు యూనిట్ పనులు పురోగతిలో ఉన్నాయని, పెండింగ్‌లోని మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. రద్దీ ప్రదేశాల్లో, సభలు, సమావేశాల సమయంలో తగిన దూరం పాటించడం, రద్దీ ప్రదేశాల్లో తిరిగేటప్పుడు మాస్కులు ధరించడం, ముఖ్యంగా చేతులను శుభ్రంగా కడుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరికైనా కరోనా లక్షణాలు కనుపడితే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, మాతా శిశు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరావు, జిజిహెచ్ సుపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలు, సంబంధిత ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.



యోగాసనాలతో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

యోగాసనాలతో వైద్య సిబ్బంది

వినూత్న నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తమ సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లు(సిహెచ్ఒ) డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు కలెక్టరేట్ వద్ద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మె 25వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వినూత్న రీతిలో చర్చి సెంటర్లో యోగాసనాలతో మానవహారం నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమం మద్దతుగా యోగాసనాలు వేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, సాయంత్రం 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు భద్రత కల్పించాలని కోరారు. ఆరు సంవత్సరాలు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రతకు ఈపీఎఫ్ఓను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంసి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్, జిల్లా సెక్రెటరీ గంట ప్రసన్న,జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్ జీవనజ్యోతి, రమేష్, కామేష్, దీప్తి, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీని

ఒంగోలులోనే కొనసాగించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

త్రిపుల్ ఐటి మొదటి సంవత్సరం తరగతులు ఒంగోలులోనే కొనసాగించాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్న రావు అండ్ నాయుడు కాలేజీకి రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించి, యాజమాన్యం నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిలు చెల్లించి తరగతులు ఇక్కడే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఒప్పందం ప్రకారం ప్రభుత్వం నెలకు రూ 15 లక్షలు చొప్పున అద్దెలు చెల్లించకుండా కోట్ల రూపాయల బకాయిలు చెల్లించనందున యాజమాన్యం ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా యాజమాన్యం నగరపాలక సంస్థకు పన్ను చెల్లించనందున నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా నిలుపుదల చేసిందన్నారు. ప్రభుత్వం తన తప్పిదం కప్పిపుచ్చుకుని యాజమాన్యం ఖాళీ చేయమన్నారన్న సాకు చూపి ఇక్కడ చదువుతున్న 1300 మంది విద్యార్థులను ఇడుపులపాయ, నూజివీడు తరలించడం, రెండో సంవత్సరం తరగతి చదువుకు తిరిగి ఒంగోలు ఎస్ఎస్ఎన్ కాలేజీకి రావడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇక్కట్లు ఎదుర్కొంటారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కాలేజీ అద్దె బకాయిలు చెల్లించి యధావిధిగా కొనసాగించడానికి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి1 పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుండి 12.00 గంటల వరకు కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఇఇ పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కూరగాయల మార్కెట్ , పార్వతమ్మ గుడి, వడ్డె పాలెం, భీమరాజు వారి వీధి, మంగళ పాలెం, బండ్ల మెట్ట, పివిఆర్ హైస్కూల్ , రంగారాయుడు చెరువు, సాయిబాబా గుడి, లాయర్ పేట, విఐపి రోడ్ మొత్తం, కళానికేతన్, అయ్యప్ప స్వామి టెంపుల్, మంగమూరు డొంక సిగ్నల్ పాయింట్ వరకు, 60 అడుగుల రోడ్డు, అద్దంకి బస్టాండ్, ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న రేపల్లె సిడిపిఒ సుచిత్ర

కిషోర బాలికలకు పోషకాహారం అందించాలి

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఐసీడీస్ ప్రాజెక్ట్ పరిధిలోని 8,9 వార్డుల్లో కిషోర వికాసం వేసవి క్యాంపు శుక్రవారం నిర్వహించారు. బాలల హక్కులు, బాలల సంరక్షణ మధ్య ఉన్న వ్యత్యాసం గురించి సిడిపిఓ ఎం సుచిత్ర వివరించారు. పేదరికం, అనారోగ్య పరిస్థితుల్లో వున్న వారు హక్కులు పొందేలా చర్యలు తీసుకోవటం గురుంచి తెలిపారు. బాల్య వివాహాల దుష్ప్రభావం, బాలల హక్కులు, బాలికల పోషణ, బాలికల రక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పాటలు, డాన్సులు, నాటకీకరణ రూపంలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శివజ్యోతి, బి హరిత, మహిళ సంరక్షణ కార్యదర్శి, ఆషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్వైజర్ నాగరాజ కుమారి

వేమూరు : బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమని, బాలికలు అవగాహన కలిగి ఉండాలని సూపర్వైజర్ నాగరాజ కుమారి సూచించారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో కిషోర వికాసం శుక్రవారం నిర్వహించారు. బాలల హక్కులు, సంరక్షణ వంటి అంశాలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరు : కిశోర వికాసంలో భాగంగా 7వ రోజు ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ విజయలక్ష్మి కిశోర బాలికలకు ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించారు. మండలంలోని రావికంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో కిషోర్ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ దివాకర్

నాటు సారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో నవోదయం 2.0పై ప్రజలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ దివాకర్ మాట్లాడుతూ గంజాయి, సారా పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించే దిశగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటుసారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయని అన్నారు. భవిష్యత్తు తరాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. నాటు సారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం, వ్యాపారాలు చేసుకునేందుకు సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువ మొత్తంలో బెల్లం అమ్మి నాటు సారా తయారీకి సహకరిస్తే వారిపై పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు.

భట్టిప్రోలులో నిలిచిన అపరాల కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రం ఆదిలోనే నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో మార్క్ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా కొనుగోలు చేసే పెసలు సైజు తక్కువగా ఉందని, ఈ పెసలు గోదాముకు నడిచే పరిస్థితి లేదని వడ్లమూడిలోని వేర్ హౌస్ అధికారులు చెప్పటంతో కొనుగోలు నిలిచిపోయాయి. అప్పటికే అనేక ప్రాంతాల నుండి వేర్ హౌస్‌కు వెళ్లిన అనేక లోడ్లు నాణ్యత లోపంగా, సైజు తక్కువగా ఉందనే నెపంతో వెనక్కు పంపించినట్లు తెలిసింది. దీంతో భయపడిన పిఏసిఎస్ అధికారులు అప్పటికే రైతుల నుండి కొనుగోలు చేసిన పెసలు శాంపిళ్లను ముందుగా వేర్ హౌస్ గోడౌన్లకు తీసుకువెళ్లి అధికారుల ద్వారా పరిశీలన జరిపారు. ఈ పరిశీలనలో ఈ ప్రాంతంలో పండిన పెసలు సైజు తక్కువగా ఉందని దీనిలో మట్టి శాతం ఉన్న దృష్ట్యా జల్లెడ వేస్తే 50శాతంపైగా గింజలు క్రిందకు దిగిపోవడమే కాక నాణ్యత లోపభూయిష్టంగా ఉన్నాయని అధికారులు చెప్పడంతో చేసేదేమీ లేక పిఎస్ఎస్ అధికారులు కొనుగోళ్లను నిలిపివేసినట్లు తెలిసింది. అప్పటికే సుమారు 10మంది రైతులు కొనుగోలు కేంద్రంలో గింజలు వేసి జల్లెడ కూడా పట్టిన దృష్ట్యా కొంతమేర రైతులు నష్టాన్ని



అపరాల గోతాలు ట్రాక్టర్‌లో వేస్తున్న రైతులు

ఎదుర్కోవాల్సి వచ్చింది. కొనుగోలు నిలిపివేయడంతో చేసేదేమీ లేక అప్పటికే గోడౌన్‌కు తరలించిన పలువురు రైతులు వారి పెసల సరుకులు తిరిగి మరల వెనుకకు తీసుకువెళ్లే పరిస్థితి ఏర్పడింది. అదే రీతిలో పలువురు రైతులు బయట వ్యాపారులకు అక్కడికక్కడే ఐన కాడికి అమ్ముకున్న ఘటనలు ఉన్నాయి.

ప్రభుత్వ విధానాలే రైతుకు శాపం

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం పదేపదే చెబుతున్నప్పటికీ ఆ మేరకు విధివిధానాలు ఖరారు చేయడంలో విఫలం చెందిందని రైతులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. మినుము, పెసర, తెల్లజొన్న, మొక్కజొన్న వంటి పంటలకు ఈ ఏడాది ఫిబ్రవరి నెల్లోనే అధిక ఎండలు సంభవించడంతో భూమిలో చాలా శాతం తగ్గిపోయి మొక్కకు తేమ లేక గింజ పాలు పోసుకునే దశలోనే ఎండిపోయాయి. రైతులు ఎన్ని విధాలుగా పెట్టుబడులు పెట్టి మందులు పిచికారి చేసినప్పటికీ భూమిలో తేమ లేని కారణంగా పంట దిగుబడుల్లో వ్యత్యాసం ఉండటమే కాక నాణ్యత కోల్పోయాయని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పరిమితులను సడలించి రైతుల వద్ద ఉన్న పంటలను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ నాణ్యత లోపం సైజు తక్కువగా ఉన్నాయనే నెపంతో పండిన పంట వెనక్కు పంపించటం పట్ల ప్రభుత్వంకు రైతుల పట్ల చిన్నచూపు కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ రైతులకు ఏమాత్రం ఉపయోగపడలేదనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయంపై పిఎసిఎస్ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల నుండి అపరాలు కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా సిద్ధమయ్యామని, వేర్‌హౌస్ గోడౌన్‌లో విధించిన నిబంధనలతో మన ప్రాంతంలో పండిన సరుకు సైజు తక్కువగా ఉండటంతో కొనుగోళ్ళ నిలిపివేసినట్లు తెలిపారు. దీని కారణంగా సొసైటీకి కూడా కొంతమేర నష్టం వాటిలినట్లు చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు

- నామాత్రపు తనిఖీలతో సరి
- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- పట్టించుకోని ప్రణాళికా విభాగం

ప్రజాశక్తి - రేపల్లె

తీర ప్రాంతమైన రేపల్లె పట్టణం వర్తక, వ్యాపార, వాణిజ్యాలకు కేరాఫ్‌గా నిలుస్తుంది. రోజు రోజుకూ పట్టణం విస్తరిస్తుంది. బహుళ అంతస్తుల నిర్మాణాలు చకచకా జరిగిపోతున్నాయి. దీనినే అభివృద్ధికి మెట్టుగా భావిస్తున్నారు. లోప భూయిష్టంగా జరుగుతున్న అనేక నిర్మాణాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. పట్టణంలోని భవనాల భద్రతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల్లో వివిధ వ్యాపారాలు, ఆస్పత్రులు, హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెద్ద పెద్ద భవంతులు నిర్మించి అనేక రకాలైన వ్యాపారాలు చేస్తున్న యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టడం లేదు. నిర్మాణ సమయంలోనే వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక భవనాలు పూర్తి విరుద్ధంగా ఉండటం విస్మయం కలిగిస్తోంది. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రజల



రేపల్లె పట్టణ చిత్రం

ప్రాణాలకు గ్యారెంటీ లేదని, పట్టణంలో అనేక భవనాల పరిస్థితి ఇలాగే ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు

బహుళ అంతస్తులు నిర్మిస్తున్న యజమానులు అనేక మంది ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి తమకు ఇష్టం వచ్చినట్లు నిర్మించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, అపార్ట్ మెంట్లు, హాస్టల్ భవనాలు ఇదే విధంగా నిర్మించడం ఆందోళన కలిగించే విషయం. భవనాలు నిర్మిస్తున్న యజమానులు రాజకీయ పలుకుబడి కలిగి ఉండటంతో కొన్నింటిలో చూసీ చూడనట్లు వదిలేస్తున్నామని అధికారులే బాహాటంగా చెబుతున్నా కొన్నింటిపై మాత్రం తూ తూ మంత్రంగా చర్యలు తీసుకుని వదిలేస్తున్నారు. ఫలితంగా భవనాల భద్రతపై నీలినీడలు అలముకున్నాయి. ప్రజల ప్రాణాలమీదికి వస్తుండటం గమనార్హం. వ్యాపారాలు చేయడానికి, అద్దెలకు ఇచ్చుకోవడానికి చూపుతున్న ఆసక్తి నిబంధనల మేరకు నిర్మించుకుందామనే ఆలోచన ఉండటం లేదనే విమర్శలు మెండుగా వినిపిస్తున్నాయి. వంద, రెండు వందల గజాల్లోనే ఎటువంటి సౌకర్యాలు లేకుండా బహుళ అంతస్తులు నిర్మించడం, వ్యాపార సముదాయంగా మార్చడంలో యజమానులు ఆరితేరారు. కొరడా ఝులిపిస్తారా? 'మామూలు'గానే సరిపెడతారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల విషయంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా? లేదా రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి తీసుకువస్తారా? అన్నది చూడాలి. వివిధ శాఖల అధికారులు చర్యలకు పూనుకుంటే పట్టణ వ్యాప్తంగా వందల బహుళ అంతస్తుల భవనాలు నిబంధనలు బయటపడతాయి. వీటన్నింటిపై చర్యలు తీసుకుని సౌకర్యాలు ఏర్పాటు చేయించే బాధ్యత అధికారులు తీసుకుంటే ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చినట్లు అవుతుంది. 'మామూలు'గా నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకుంటే జరగరాని ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

దళితుల స్మశాన వాటిక స్థలంపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత వైసిపి ప్రభుత్వం మండలంలోని పెదలంక గ్రామ మధ్యగూడెం దళితవాసులకు స్మశాన వాటికై కేటాయించిన స్థలంపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. సర్వే నెంబర్ 102/1ఏ, 102/1సిలో 2.32 ఎకరాల పోరంబోకు స్థలాన్ని సర్వే చేసి గ్రామస్తుల కోరిక మేరకు స్మశాన వాటికకు కేటాయించారు. అయితే ఇదే భూమిలో కొంత భూమిని అదే గ్రామానికి చెందిన ఓ రైతు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడు. సుమారు 10ఎకరాల భూమి కలిగిన రైతు పోరంబోకు భూమిని ఇప్పటి వరకు పండించుకున్నప్పటికీ దానిని దళితులకు స్మశాన వాటిక కింద కేటాయించిన దృష్ట్యా ఖాళీ చేసి అప్పగించాలని అప్పట్లోనే అధికారులు ఆ రైతును ఆదేశించారు. అయినప్పటికీ ఆ రైతు ఆ భూమిని వదల కుండా సాగు చేసుకుంటూ కోర్టును ఆశ్రయించాడు. దళిత వాడ స్మశాన స్థలం కింద కేటాయించినట్లుగా అధికారులు అందజేసిన ఉత్తర్వులు, ఆ భూమికి సంబంధించిన



పెదలంక దళితులకు కేటాయించిన ప్రభుత్వ పోరంబోకు స్థలం

వివరాలను సేకరించి గ్రామ దళిత నాయకులు కోర్టుకు సమర్పించారు. అయితే రైతు ఆ భూమి తన స్వాధీనంలో ఉన్నట్లుగా కోర్టు విధించిన గడువులోగా ఆధారాలతో అప్పగించాలని సూచించగా ఆ సమయానికి ఆ రైతు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో దానిని కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో జిల్లా కలెక్టర్ మరో సారి ఈ భూమిని దళితుల స్మశాన వాటికకు కేటాయించే విధంగా ఉత్తర్వులు జారీ చేసి ఆర్‌డిఒ, తహశీల్దారుకు రాత పూర్వకంగా ఆదేశించారు. ఈ ఆదేశాలు పాటించటంలో స్థానిక అధికారులు రైతుతో లాలూచీపడి భూమిని కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని దళితవాసులు అగ్రహ వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా స్మశాన వాటిక కోసం తామంతా ఐకమత్యంగా అధికారులు చుట్టూ తిరిగి ప్రయత్నం చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కాలయాపన జరుగుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి దళితులకు కేటాయించని భూమిని అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని దళితులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దారు మేకా శ్రీనివాసరావు మాట్లాడుతూ పెదలంక మధ్యగూడెం దళితులకు కేటాయించాల్సిన భూమిపై ఆ గ్రామ రైతు మరోసారి కోర్టును ఆశ్రయించారని చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ అంశాన్ని ఇప్పట్లో తామేమి చేయలేమని వివరించారు.

ఈ ఏడాదీ కాల్వల్లో పూడికతీత లేనట్లేనా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రతి ఏట అధిక వర్షాలకు ముంపుకు గురయ్యే పంట పొలాల నుండి నీరు బయటకు వెళ్లి ప్రధాన మురుగు కాలువ కనగాల అప్లూయెంట్ ఈ ఏడాది కూడా పూడికతీత పనులు జరిగేనా? అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోయి అధిక వర్షాలకు కాలువ పూడిపోయింది. దీనిని గత మూడేళ్లుగా ఉపాధి హామీ పథకం కింద కూలీలతో కొంతమేర పనులు జరిపించారు. అయినప్పటికీ పూడికచిత చేపట్టకపోవడంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక అధిక వర్షాలకు నీరు ఎగదట్టి పంట పొలాలను ముంచేస్తుంది. భట్టిప్రోలు, తెనాలి మార్గంలోని అద్దేపల్లి నుండి ప్రారంభమైన ఈ మురుగు కాలువ గూడవల్లి, గంగోలు మురుగు కాలువలో కలుస్తుంది. ఈ మురుగు కాలువ పరిధిలో ఐదు వేల ఎకరాల సాగుభూమి నుండి వర్షపునీటిని బయటకు తరలిస్తూ ఉంటుంది. గతేడాది ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు పూర్తి చేసుకున్న ఆనంతరం కురిసిన అధిక వర్షాలకు పంట పొలాలు పూర్తిగా నీట మునిగి నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిల్వ ఉండటంతో వరి నాట్లు పూర్తిగా దెబ్బతిని నేలమట్టం అయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో మారు నాట్లు వేయడానికి కూడా నారు లేకపోవడంతో అనేక మంది రైతులు పంట పొలాలను ఖాళీగా వదిలేశారు. ఇలాంటి పరిస్థితి ప్రతి ఏట ఎదురవుతూనే ఉంటుందని, అయినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ మురుగు కాలువపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. మురుగు పారుదలకు అత్యంత ప్రధానమైన ఈ కాలువ పట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులకు నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తుందని ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు ముంపుకు గురైన సమయంలో ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతు కన్నీళ్లు తుడిచేందుకు పలు రకాల వ్యాఖ్యలు చేస్తూ ఉంటారే కానీ పని జరిపించాల్సిన సమయంలో మాత్రం ఏ ఒక్కరు కనిపించరని రైతులు వాపోతున్నారు.



మురుగు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

అధికారుల చర్యలు శూన్యం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు కురుస్తుండడంతో మురుగు కాలువలో వర్షపు నీరు నిలబడి గుర్రపు డెక్క పూర్తిగా పెరిగి పోయిందనీ, జూన్ నెలలో మరింత వర్షం కురిసే అవకాశం ఉన్నందున అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే ఈ మురుగు కాలువ పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే అధికారుల చర్యలు కనిపించడం లేదని ఆ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నీటి సంఘాలను కూడా ఏర్పాటు చేసిన దృష్ట్యా ఆ సంఘాల ద్వారానైనా ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసి రానున్న ఖరీఫ్ సీజన్‌కు రైతులు నష్టపోకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై నీటి సంఘం అధ్యక్షులు యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు మాట్లాడుతూ మురుగు కాలువ అభివృద్ధికి మంత్రి అనగాని సత్యప్రసాద్ ద్వారా రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు అధికారులు చెప్పినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన విధివిధానాలు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



పర్చూరు, చీరాల రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీళ్లు

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరు, చీరాల ఆర్ అండ్ బి రోడ్డులోని సినిమా హాల్ సెంటర్లో కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై మోకాల్లోతున వర్షపు నీరు చేరుతుండడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు ప్రయాణం చేసేటప్పుడు పాదుచారులపై రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరుపైన పడుతున్నాయి. నీరు ఎక్కువ కాలం రోడ్డుపైన నిలిచి ఉండడం వల్ల దుర్గంధం వెదవెలుతున్నది. ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు పోవడానికి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు అంతా రోడ్డుపైకి చేరుతున్నది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, షాపుల వారు ఎవరికివారు రోడ్డు మార్జిన్‌లో మెరకలు తోలడంతో ఆర్ అండ్ బి రోడ్డు పల్లంగామారి వర్షపు నీరు నిలిచి ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. భారీ వర్షం గనుక కురిస్తే రోడ్డు అంతా జలమయం అవుతుంది. ఈ విధంగా నీళ్లు నిలిచి ఉండడానికి రోడ్డు ఎరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడమేనని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేయాలని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ఉన్న కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి మురుగు నీరుపారుదల అయ్యేటట్లు చూడాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామ సభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - అమృతలూరు

స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 24నుండి 28వరకు గ్రామాల్లో నిర్వహించే సభలను జయప్రదం చేయాలని ఎంపిడిఒ మారుతి శేషమాంబ కోరారు. సభలకు రెండు టీంలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక టీంకు ఎంపిడిఒ, 2వ టీంకు డిప్యూటీ ఎంపిడిఒ బాధ్యత వహిస్తారని చెప్పారు. 24న ఉదయం పేపర్లు, కూచిపూడి గ్రామాల్లో, సాయంత్రం బోడపాడు, యడఊరు గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. 26న ఉదయం అమృతలూరు, మూల్పూరు, సాయంత్రం తురిమెళ్ళ, పెదపూడి, 27న ఉదయం ఇంటూరు, మాపరు, సాయంత్రం ఎలవరు, పాంచాలవరం, 28న ఉదయం గోవాడ, కోరుతాడిపరు, సాయంత్రం వామనగుంట పాలెం గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగన్‌పై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు

ప్రజాశక్తి - వేమూరు

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై తప్పుడు కేసులుపెట్టి అక్రమ అరెస్టులు చేయాలనుకుంటే చూస్తూ ఉండబోమని వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. ఆయన విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో లిక్కర్ స్కాం జరిగిందంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తూ ఐఎఎస్ అధికారులను, రాజకీయ నాయకులపై కక్ష సాధింపు చర్యలో భాగంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. ఇంతవరకు లిక్కర్ స్కాం కేసుల్లో ఏం పురోగతి సాధించారని ప్రశ్నించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఒక్క ప్రశ్నకైనా సమాధానం ఉందా? అంటూ చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపుతోనే లిక్కర్ స్కాంలో వైసిపి నేతను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రతిపక్ష పార్టీలుగా తాము ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టి మరలించేందుకే స్కాముల పేరుతో అక్రమ అరెస్టు చేస్తున్నారని అన్నారు. లిక్కర్ స్కాం కేసులో పురోగతి ఉంటే వివరాలు బయట పెట్టాలని కోరారు.



వైసీపీ ఇన్‌ఛార్జి అశోక్ బాబు

గొర్రె పిల్లల పెరుగుదలలో దాణా ప్రాముఖ్యత

ప్రజాశక్తి - అద్దంకి

ఏటా పెరుగుతున్న గొర్రె, మేక మాంసం డిమాండ్ కారణంగా వాటి పెంపకానికి రోజురోజుకీ ప్రాధాన్యత పెరుగుతోంది. దానికి అనుగుణంగా జివాల పెంపకం మరింత ప్రోత్సహించేందుకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, ఇతర పథకాల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందిస్తున్నాయి. మాంసం ప్రధానంగా కొందరు గొర్రెలు, మేకల పెంపకాన్ని చేపడుతుంటే మరికొందరు ఈ జీవాల నుంచి లభించే పేడను ఎరువుగా అమ్మి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. గొర్రెల పెరుగుదల్లో వాటికి అందించే దాణాకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. మనం అందించే దాణాను బట్టి వాటి పెరుగుదల ఆధారపడి ఉంటుంది. గొర్రెల పెరుగుదల ఆశించిన విధంగా ఉండాలంటే ఎలాంటి దాణా అందించాలో తెలుసుకోవాలి.

పోషకాహారంతోనే పెరుగుదల

గొర్రె పిల్లలకు పుట్టిన మొదటి రోజు నుంచి 20 వారాల వయసు వచ్చేవరకు వివిధ దశల్లో సరిపడేంత పాలు, క్రీపు దాణాను, టిఎంఆర్ (టోటల్ మిక్స్డ్ రేషన్)ను నిర్దేశిత పరిమాణంలో అందించాలి. వీటిని సరైన పరిమాణంలో అందిస్తే 5 లేదా 6 నెలల వయస్సులోనే గొర్రె పిల్లలు 28 నుంచి 30 కిలోల బరువు పెరుగుతాయి. దీని వల్ల త్వరగా వీటిని కోతకు అమ్మి మంచి ఆదాయం పొందవచ్చు. అలాగే వాటి మరణాల శాతాన్ని కూడా గణనీయంగా తగ్గించవచ్చు.

వివిధ దశల్లో అందించాల్సిన పోషణ

పుట్టిన మొదటి 3 రోజుల్లో తల్లితోపాటు వెచ్చని వాతావరణంలో పిల్లను ఉంచాలి. పిల్ల శరీర బరువులో 20 శాతం జున్నుపాలను ప్రతి రోజూ అందించాలి. మొదటి రెండు వారాలు పిల్లలను పూర్తిగా తల్లిపాలమీదనే ఉంచాలి. పుట్టిన పిల్ల శరీర బరువు 3 కిలోలు ఉంటే రోజుకి 600 మిల్లీ లీటర్ల పాలు అవసరం. ఒకవేళ తల్లి వద్ద సరిపడనంత పాలు లేకపోతే ఆవు లేదా గేదె పాలు అదనంగా అందించాలి.

క్రీపు దాణా నమూనా ఫార్ములా

నలగగొట్టిన మొక్కజొన్నలు 40 కిలోలు, తవుడు 20 కిలోలు, నూనె తీసిన చెక్క 30 కిలోలు, పప్పుల పరం 7 కిలోలు, కిలో ఉప్పు లవణ మిశ్రమం 2 కిలోలు, టిఎంఆర్ నమూనా ఫార్ములా నూనె లేదా పప్పుది నుసుల మిగుళ్ల వేరు శెనగచెత్త లేదా మినప చెత్త 50 కిలోలు, తవుడు 10 కిలోలు, పప్పులపరం 7 కిలోలు, నలగగొట్టిన మొక్కజొన్నలు 20 కిలోలు, లవణ మిశ్రమం 2 కిలోలు, నూనె తీసిన చెక్క 10 కిలోలు, ఉప్పు 1 కిలో పైన సూచించిన పదార్థాలను మిక్స్ చేసి క్రీపు దాణా, టిఎంఆర్ నమూనాలను తయారు చేసుకోవచ్చు. వీటి తయారీ, వినియోగానికి సంబంధించి స్థానిక పశు వైద్యాధికారి సలహామేరకు చవకగా దొరికే పప్పు లేదా నూనె దినుసులు, పంట మిగుళ్లతో తయారు చేసుకుంటే ఖర్చు కాస్త తక్కువగా ఉంటుంది. పుట్టిన నెల వయస్సు నుంచే పిల్లలను కూడా తల్లులతో పాటుగా మేపు కోసం బయటకు తీసుకెళ్తుంటారు. విస్తృత మేపు పద్ధతిలో గొర్రెలకు సరైన సంపూర్ణ పోషకాహారం లభించక పిల్లల్లో రోజువారీ పెరుగుదల 100 గ్రాములకు మించడం లేదు. ఇవే పిల్లలను మేపు కోసం బయటకు పంపకుండా, పుట్టిన తొలి రోజు నుంచి 150 రోజుల వయసు వరకు సమతుల్యమైన సంపూర్ణ ఆహారం కావాల్సిన పరిమాణంలో షెడ్లలోనే అందించగలిగితే పిల్లల రోజువారీ పెరుగుదల కనీసం రోజుకు 175 గ్రాములకు తగ్గకుండా ఉంటుందని పశు వైద్య నిపుణులు చెబుతున్నారు.



మద్యం దుకాణం పరిశీలిస్తున్న బి వెంకటేశ్వర్లు

మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో మద్యం దుకాణాలు నియమ నిబంధనల మేరకు నిర్వహించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి వెంకటేశ్వర్లు కోరారు. మద్యం దుకాణాలు పనిచేయు సమయాలను ఆయన బాపట్ల స్టేషన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మద్యం షాపులు ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఏడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని షాపుల పని వేళలు, ఎంఆర్‌పి ఉల్లంఘనలు, బెల్టు షాపుల గురించి టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచుతున్నామని తెలిపారు. నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబందనలు అతిక్రమించి కేటాయించిన సమయానికన్నా ముందుగా షాపులు తెరచిన, రాత్రి సమయాల్లో ఎక్కువసేపు తెరచి వున్నా ఆయా దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యాయవాది నటరాజన్ మృతి

ప్రజాశక్తి - బాపట్ల



నటరాజన్ (41)

బాపట్లకు చెందిన న్యాయవాది అంగలకుదురు నటరాజన్ (41) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న ఆయన బాపట్ల బార్ అసోసియేషన్ సభ్యునిగా ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు అవినాష్, న్యాయవాది జడ్ భాష, విన్నకోట సత్యప్రసాద్, నందనం ప్రసాద్, పలువురు న్యాయవాదులు సంతాపం తెలిపారు.



చేతికందే అంత కిందులో విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు, పాత మాగులూరు గ్రామాల మధ్య హై టెన్షన్ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా కిందికి వచ్చింది. సర్వేనెంబర్ 171ఏ లో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపార వర్గాల వారు భూములను కొనుగోలు చేసి 8 అడుగుల మేర ఆ ప్రాంతమంతా మెరక తోలడంతో సంతమాగులూరు నుండి పాత మాగులూరు వెళ్లే 11కెవి విద్యుత్తు లైను ప్రమాదకరంగా మారింది. కేవలం వారు తోలిన మట్టికి ఐదు అడుగుల ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో అటుగా వెళ్లే ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవసరం కోసం భూమిని ఎత్తు లేపుకోవడం వల్ల తీగలు చేతికి అందే అంత కిందికి వచ్చినట్లు అయ్యింది. అధిక విద్యుత్ ప్రసారమయ్యే తీగలతో పెను ప్రమాదం పొంచి ఉంది. ఆ విద్యుత్తు లైను క్రిందుగా ఇటీవల పొలం వెళుతున్న వ్యక్తికి తలకు తీగ తగలడంతో షాకుకు గురై స్పృహ కోల్పోయిన ఘటన జరిగింది. విద్యుత్ అధికారులు తక్షణమే స్తంభాల ఎత్తు పెంచి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకం
- అర్హులకు ఇళ్లపట్టాలు అందిస్తాం
- అట్టహాసంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమం, భద్రత కోసం ఎన్‌డిఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వాస్తవాలకు ప్రతిబింబంగా కథనాలు రాయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలు ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్: వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యుజెఫ్) జిల్లా మహాసభ శుక్రవారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహిచారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రమంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ రాజ్యాంగం ఏర్పాటు చేసిన నాల్గో స్తంభం మీడియా అని, ప్రభుత్వం చేస్తున్న లోపాలు ఎత్తిచూపటంలో జర్నలిస్టులకు సాటి లేదన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యేలు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. జర్నలిస్టులు అన్ని విధాల ఆదుకునేందుకు కృషి చేస్తామని, జిల్లా కొత్త కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ విలువలతో కూడిన వృత్తి చేసే వ్యక్తులలలో జర్నలిస్టులు ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపటం సరైందే కానీ ఇష్టారీతిన వార్తలు రాయటం మానుకోవాలన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తాను ముందు ఉంటానన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలపై వార్తలు రాసే క్రమంలో ప్రజాప్రతినిధులను సంప్రదించాలని.. తాము స్పందించకపోతే కథనాలు రాయవచ్చన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు వారధిగా జర్నలిస్టులు ఉన్నారని, అటువంటి వారి సంక్షేమానికి తాము కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విలువతో కూడిన జర్నలిజం సమాజానికి అవసరమని, కొందరు జర్నలిస్టులు రాసే కథనాలు ఇబ్బందికరంగా ఉంటున్నాయన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మీడియాకు ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న తీరును ఆనాటి పత్రికలు ప్రజలకు తెలియజేసి ఉత్తేజాన్ని రేకెత్తించాయన్నారు. మంచి పనులను ప్రోత్సహిస్తే మరిన్ని చేయటానికి అవకాశం ఉందని, ఆదిశగా జర్నలిస్టులు ఆలోచించాలన్నారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసేది జర్నలిస్టులని, నీతి నిజాయితీతో వారు వ్యవహరిస్తారన్నారు. జనం నాడి తెలిసినవారని, అక్రమాలు వెలికితీస్తారన్నారు. జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఎలాంటి వైద్య సదుపాయాలు అవసరమైనా తనను సంప్రదించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అవినీతి అక్రమాలను జర్నలిస్టులు వెలికితీస్తారని, అటువంటి వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అవినీతి అక్రమాలు ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎస్‌వి బ్రహ్మం ప్రసంగించారు. తరువాత సీనియర్ పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎపి లైక్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్ షేక్ రియాజ్, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, ఎపి కమ్మ సేవా ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, సీనియర్ పాత్రికేయులు నాతాని బ్రహ్మానందం, కోలా హరిబాబు, ఆర్.రామకృష్ణ, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ఎపిడబ్ల్యుజెఫ్ రాష్ట్ర నాయకులు సుధాకర్, మాజీ అధ్యక్షులు సిహెచ్ కాశీ విశ్వనాథ్, ఆర్.రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వి.భక్తవత్సలం, షేక్ చిన్న కరిముల్లా, దాసరి సునీల్, టివి 9 స్టాఫ్ రిపోర్టర్ ఫైరోజ్ బేగ్, టివి5 స్టాఫర్ జనార్ధన్, ఆంధ్రప్రభ బ్యూరో ఇన్‌చార్జి పి.విజయభాస్కర్ రెడ్డి, పి9 ఎమ్‌డి పి.కిరణ్‌కుమార్, ఎంసిఏ అధ్యక్షులు వి.నాగేశ్వరరావు, ఎడిటర్స్ పబ్లిషర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు, జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లా కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మహాసభ అనంతరం ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా వి.భక్తవత్సలం, అధ్యక్షులుగా ఎస్‌కె చిన్న కరీముల్లా, ప్రధాన కార్యదర్శిగా దాసరి సునీల్ (వార్త ఎడిషన్ ఇన్‌చార్జి), ఉపాధ్యక్షులుగా ఓబులశెట్టి రాధాకృష్ణ(వెలుగు) ఉప్పుటూరి రాజశేఖర్(వార్త), రాగిపిండి రామకోటిరెడ్డి(ప్రజాశక్తి) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఫడిదపు రవికుమార్(సింగరాయకొండ), రావిపాటి సుధాకర్, తలారి శైలజ, కోశాధికారిగా ఏసుపోగు కోటయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్‌కె ఖుషీదా, వెన్నా శ్రీనివాస రెడ్డి, పోలేపల్లి మహేష్, రెక్కల వెంకటేశ్వర రెడ్డి, మేడికొండ శ్రీనివాసులు, ఎం.శ్రీహరి, షేక్ కరిముల్లా, బి.నాగేశ్వరరావు, ఎం.ప్రసాద్ బాబు, చింతలపూడి వాసు ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ



వికలాంగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

వికలాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గిరిజన, దివ్యాంగుల సమస్యల పరిష్కారం పై జిల్లా అధికార యంత్రాగం ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లాలోని గిరిజన దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన, దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వేటపాలెంలో 60 మంది యానాది కులానికి చెందిన వారికి ఆలస్యపు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని, ఆధార్ ఎన్రోల్మెంట్‌కు కావలసిన డోమి సెల్ ధ్రువీకరణ పత్రాలు కోరుతూ వచ్చిన ఫిర్యాదునకు ఆయన స్పందించి వెంటనే ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని వేటపాలెం తహసిల్దార్ ను ఆదేశించారు. అక్కయ్యపాలెం పంచాయతీలో 300 యానాదుల కుటుంబాలకు స్మశానం కోసం స్థల సేకరణ చేసి నివేదిక అందించాలని వేటపాలెం తహసిల్దార్ ను ఆయన ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం వారంలో 3 రోజులు (సోమ, మంగళ, బుధవారం) బాపట్ల జిల్లాలో విధులు నిర్వహించాలని సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. ఇందుకోసం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలిన 3 రోజులు ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించుకోవలసినదిగా ఆయన ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పెంచన్లు పంపిణీ చేసిన తర్వాత మిగిలి మొత్తాన్ని 5వ తేదీలోపు ప్రభుత్వానికి చలానా రూపంలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్‌రావు, సహాయ సంచాలకులు వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, జిల్లా అధికారులు వీక్షణ సమావేశం ద్వారా రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు,తాసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించొద్దు..

- 2,550 మందిపై కేసులు నమోదు
- ఎస్పీ తుషార్‌డూడీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఉపేక్షించబోమని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు గురువారం రాత్రి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. 2,550 మందిపై కేసులు నమోదు చేశారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. గత రాత్రి జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 51 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. వారిని సంబంధిత న్యాయ స్థానాలలో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. 2025 జనవరి నుండి ఇప్పడి వరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 2,550 మందిపై కేసులు నమోదు చెయ్యడం జరిగిందన్నారు.

నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌పై సుమోటో కేసు నమోదు చేయాలి

అమరుల బంధుమిత్రుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

ప్రజా ఉద్యమంలో అమరులైన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేయకపోవడం ప్రజాస్వామిక విరుద్ధమని ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ పౌరులను హత్య చేయడంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించి నారాయణపూర్ జిల్లా మాడ్ అటవీ ప్రాంతంలో జరిగినట్లుగా చెబుతున్న ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల మండలం, జాండ్రపేట గ్రామంలో నాగేశ్వరరావు సోదరుని ఇంటికి వెళ్లిన ప్రజా సంఘాల ప్రతినిధులు అమరుడు నాగేశ్వరరావు సోదరుడు సజ్జా శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు అంజమ్మ మీడియాతో మాట్లాడుతూ మే 20వ తేదీ మరణించిన అమరుల మతదేహాలను భద్రపరచకుండా కాలయాపన చేస్తూ శరీరం కుళ్ళిపోయే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరణించిన ఉద్యమకారులపైన కూడా హింసను ప్రయోగిస్తుందన్నారు. అమరుల కుటుంబ సభ్యులను వేధింపులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. మతం పేరుతో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మతుల కుటుంబాలు నిర్వహించే అంతిమ సంస్కార సంప్రదాయాలను జరుపుకోవడానికి మతదేహాలను అప్పగించకపోవడం హిందూ సాంప్రదాయానికి విరుద్ధమని ఆమె తెలిపారు. విప్లవ రచయితల సంఘం నేత అరసవల్లి కష్ణ మాట్లాడుతూ మధ్య భారత దేశంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఆదివాసీలపై కొనసాగుతున్న సైనిక చర్యల ద్వారా మానవహక్కుల హననం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులు పలుమార్లు శాంతి చర్చలకు సిద్ధమని అందులో భాగంగా కాల్పుల విరమణ ప్రకటించినప్పటికి ఏకపక్షంగా సైనిక చర్యలకు పాల్పడుతూ దేశంలో భయానక పరిస్థితులను కేంద్రం సష్టిస్తోందన్నారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల మోహన్‌రావు మాట్లాడుతూ 1/70, పీసా చట్టం రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజన హక్కులు కాపాడుకోవడం కోసం జరుగుతున్న ఆదివాసి ఉద్యమాలను అణిచివేయడం ద్వారా విదేశీ బహుళ జాతి సంస్థలకు లక్షల కోట్ల విలువైన అటవీ ఖనిజ సంపదలను దారాదత్తం చేయడానికి కేంద్రం చేస్తున్న కుటిల ప్రయత్నమే ఆపరేషన్ కగార్ అన్నారు. ఆపరేషన్ కగార్ ను దేశ ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికున్న తన విశేష అధికారాన్ని ఉపయోగించి అంతర్గత అశాంతిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్చలను కొనసాగించకపోగా, పలుమార్లు చర్చలకు మావోయిస్టులు ప్రతిపాదనలు చేసినప్పటికీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ వారిని అంతమెందించడమే ధ్యేయంగా కేంద్రం ఉందన్నారు.

ఇప్పటివరకు సమాచారం లేదు: సజ్జా సోదరుడు

నారాయణపూర్ జిల్లా మాడ్ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పులలో మతి చెందిన మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, మిలటరీ పత్రిక ఇంచార్జ్ సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ నవీన్ సోదరుడు సజ్జా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రోజు వరకు ప్రభుత్వం నుండి మా సోదరుడు మరణించిన విషయం గానీ, మతదేహాన్ని తీసుకువెళ్ళవలసిందిగా సమాచారం గానీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వంతో ఆలోచించి వెంకట నాగేశ్వరరావు మతదేహాన్ని తమ కుటుంబానికి అందజేయాలని స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సహకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య కొండారెడ్డి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వై.వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ నేత పి.పుల్లయ్య, రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు దేవన వీర నాగేశ్వరరావు, బిసి ఫెడరేషన్ నాయకులు ఊటుకూరు వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి దేవాంగ సమితి బీరక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.